క్లుప్తంగా

మెదక్ చర్చిలో పూజలు



ప్రత్యేక ప్రార్థనల్లో ఏపీ టూరిజం డైరెక్టర్ జయన్న కుటుంబం

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి కట్టడం ఓ అద్భుతమని ఆంధ్రప్రదేశ్ టూరిజం డైరెక్టర్ జయన్న పేర్కొన్నారు. గురువారం ఆయన తన కుటుంబీకులతో కలిసి మెదక్ చర్చిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మత గురువులు డేవిడ్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయనను ఆశీర్వదించారు.

మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్

తూప్రాన్: మున్సిపల్ 2024 – 25 వార్షిక సంవత్సర బడ్జెట్ సమావేశం మున్సిపల్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి చైర్మన్ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆదాయం సాధారణ, ఇతర గ్రాంట్లు కలుపుకొని రూ.1679.20 లక్షలు కాగ వ్యయం రూ.1652.46 లక్షలుగా గుర్తించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ అంశాల వారీగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టారు. ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజొద్దీన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆరు మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాలేదు.

రైతుబజార్‌లో రైతుల సమస్యలు



ఈఓకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో రైతుబజార్ వేలంలో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఈఓ నాగభూషణంకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు భీంరావుపల్లి మాజీ వార్డుమెంబర్ బోయిని భూషణం మాట్లాడుతూ.. రైతులు రైతుబాజార్‌కు తెచ్చిన కూరగాయల వేలం ఆలస్యంగా చేస్తున్నారని తెలిపారు. లక్షల రూపాయల రైతుబాజార్ డబ్బులు గ్రామ పంచాయతీకి వస్తున్నా.. మహిళల కోసం మరుగుదొడ్లు లేవని మార్కెట్ షాంపిల్ పేరుతో కూరగాయలు తీసుకుంటున్నారని వాపోయారు. దీంతో ఈఓకు ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం, పోలీసు అధికారులు

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం షీటీం, పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న మోసాలు, సెల్‌ఫోన్‌లకు మీకు బహుమతి వచ్చిందని, ప్రభుత్వ పథకాలు కావాలంటే ఈ నెంబర్‌కు ఓటీపీ తెలుపాలని వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్న తీరును కళాబృందం సభ్యులు విద్యార్థులు నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అలాగే ప్రేమలు.. మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణ.. హెల్మెట్ ప్రాధాన్యత, సెల్ ఫోన్ వినియోగం తదితర అంశాలపై పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం హెడ్ కానిస్టేబుల్ ఇన్‌చార్జి సురేందర్, పోలీస్ బృందం, షీ టీం సభ్యురాలు మహిళా కానిస్టేబుల్ స్వరూప, ఎస్‌ఐ-2 యాదగిరి, ఏఎస్‌ఐ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

హవేళిఘణాపూర్(మెదక్): అనుమతి లేకుండా అక్రమంగా ఎవరైనా ఇసుక తరలించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హవేళిఘణాపూర్ ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సర్దన వాగు నుంచి అదే గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక తరలించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్దనకు చెందిన మూడు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రొటోకాల్ తప్పనిసరి పాటించాలి

కొల్చారం సర్వసభ్య సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): అధికారులు ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటిస్తూ, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను పిలవకుండా కార్యక్రమాలు చేపడితే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో తహసీల్దార్ గఫూర్ మియా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తరలి పరిష్కరించనున్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని మండలంలో పోడు భూములకు సంబంధించి, లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చిన భూమిని సాగు చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఈ విషయమై వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కిష్టాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. సంగాయిపేట పెద్ద చెరువు ఆక్రమణపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. వేసవిలో ఉపాధి కూలీలకు పని కల్పించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఎంపీపీ, ఎంపీటీసీలకు అభివృద్ధి నిధులు మంజూరు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ మేఘమాల మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మండలంలోని వరిగుంతం గ్రామ పంచాయతీ కుడి చెరువు తండాలో ఇటీవల విడుదలైన రూ.5 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైడ్ మిర్రర్‌కు ఫ్లెక్సీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): నేషనల్ హైవే బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన సైడ్ మిర్రర్‌కు ఎంపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై గురువారం 'సాక్షి' దినపత్రికలో సైడ్ మిర్రర్‌కు ఫ్లెక్సీ అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన హైవే అధికారులు అల్లాదుర్గం బ్రిడ్జి వద్ద సైడ్ మిర్రర్‌కు ఏర్పాటు చేసిన జహీరాబాద్ ఎంపీ ఫ్లెక్సీని తొలగించారు.



సైడ్ మిర్రర్‌కు ఫ్లెక్సీని తొలగించిన అధికారులు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాపన్నపేట(మెదక్): స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిస్తూ మండలంలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నపేట ఎస్‌ఐ నరేశ్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోను గాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రజల్లో ఆత్మస్థైర్యం కల్పించేందుకు పాపన్నపేట, కొడుపాక, యూసుఫ్‌పేట, కొత్తపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ ఎస్‌ఐ గణేశ్, ఏఎస్‌ఐ సంగన్న, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నట్లు చెప్పారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దళితులను ఇబ్బంది పెట్టడం సరికాదు

నర్సాపూర్: మండల రెవెన్యూ శాఖ అధికారులు పట్టణంలోని దళితులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత సంఘం నాయకుడు, కౌన్సిలర్ పంబల్ల రాంచందర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి ఆరోపించారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల అసైన్‌మెంట్ భూముల్లో నిర్మాణాలు చేపట్టారని, రెవెన్యూ అధికారులు 14 మందికి నోటీసులు ఇచ్చారన్నారు. అందులో 10 మంది దళితులు, నలుగురు బీసీలు ఉన్నారని చెప్పారు. కాగా పట్టణంలో చాలా కాలం క్రితం ప్రభుత్వం భూములు పంపిణీ చేయగా, ఆయా సర్వే నంబర్లలో చాలా మంది ప్లాట్లుగా చేసి అమ్ముకున్నారని తెలిపారు. కొనుగోలు చేసిన వారిలో అన్ని సామాజిక వర్గాల వారు ఉన్నారని.. వారంతా పెద్ద నివాస భవనాలు నిర్మించారన్నారు. వారందరికీ నోటీసులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇదే విషయమై తహసీల్దార్ కమలాద్రి వివరణ కోరగా.. తమకు కులంతో సంబంధం లేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. విచారణ కొనసాగుతుందని, అక్రమ నిర్మాణాలు చేసిన వారందరికీ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

ఆర్‌ఎస్ ప్రవీణ్ క్షమాపణ చెప్పాలి

మెదక్: ధర్మసమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్‌పై అనవసరంగా విమర్శలు చేసిన బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అతని స్వార్థం కోసం కోట్ల మంది బహుజనుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ పాదాల దగ్గర తాకట్టు పెట్టి ఎంపీ టికెట్ ఆడుకుంటున్నాడన్నారు. డాక్టర్ విశారదన్ మహరాజ్‌పై చేసిన వ్యాఖ్యాలను వెనక్కితీసుకోవాలన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో చైర్మన్ శ్రీనివాస్ చౌదరి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని వెంకట్రావు నగర్ కాలనీలోని సిద్ధార్థ విద్యా సంస్థలో తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలర్ బెల్టులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మెదక్ డీఎస్పీ రాజేశ్ మాట్లాడు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్, తైక్వాండో జనరల్ సెక్రెటరీ, కృష్ణ మాస్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీని మరోసారి గెలిపించుకుందాం

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): మోదీని ప్రధానిగా మరోసారి గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. మండలంలోని పొలంపల్లిలో సోషల్‌మీడియా కార్యకర్త సతీష్‌గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా సతీష్‌గౌడ్ విగ్రహం ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్తకు అండగా ఉండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. తనకు మెదక్ ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించిన జేపీ నడ్డా, కేంద్ర మంత్రి అమిత్‌షా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రతీ కార్యకర్త బీజేపీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, మాజీ సర్పంచ్‌లు రఘువీర్, బాలచందర్, మాజీ ఎంపీపీ కర్నపాండు, ఎంపీటీసీ రవి, నాయకులు చంద్రశేఖర్, పలు గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సతీష్ గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రఘునందన్‌రావు

వైభవంగా పెద్దమ్మ కల్యాణం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో పెద్దమ్మతల్లి, పెద్దిరాజుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పెద్దమ్మ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పనులు చేపట్టొద్దని తీర్మానం

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో పనులు చేపట్టొద్దని మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసినట్లు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిలర్ సురేశ్, పట్టణానికి చెందిన రైతు శ్రీశైలం యాదవ్ వెంచర్‌లో ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములు ఉన్నాయని తమ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారని వివరించారు. ఫిర్యాదుల నేపథ్యంలో వెంచర్‌లో ఎలాంటి పనులు చేపట్ట వద్దని తీర్మానం చేశామని చెప్పారు. తీర్మానం కాపీని మండల తహసీల్దార్‌కు పంపామని చెప్పారు. వెంచర్‌లో ప్రభుత్వ భూములున్నాయని వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి, వాస్తవాలు తేల్చాలని తెలిపారు.

భూములను సర్వే చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): పట్టాలు కల్గి ఉన్న భూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామ రైతులు కోరారు. గ్రామానికి చెందిన రైతులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 338, 339లో రికార్డులు కల్గి ఉన్న రైతులకు సంబంధించి పోజిషన్ లేనందున గొడవలు జరుగుతున్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మహిళా ఉద్యోగికి అవార్డు

నర్సాపూర్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మెగాసిటి నవకళ వేదిక ఆధ్వర్యంలో పలువురు మహిళలను ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డుతో సన్మానించారు. కాగా నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న శివపార్వతిని ఉమెన్ ఎక్సలెన్స్ అవార్డుతో మెగాసిటి నవకళ వేదిక సన్మానించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను 34 ఏళ్లుగా వైద్య శాఖలో సేవలందిస్తున్నానని చెప్పారు. తనకు అవార్డు రావడం ఆనందంగా ఉందని, అవార్డుతో తనపై బాధ్యతలు మరింత పెరిగాయన్నారు.



అవార్డు అందుకుంటున్న వైద్య శాఖ ఉద్యోగి శివపార్వతి

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని వెంకట్‌రావ్‌పేట ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి విద్యబోధన చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓగా స్రవంతి, హెచ్‌ఎం విరేశం, పీఈటి ఆకాశ్, ఉపాధ్యాయులుగా పావని, సంగమేశ్వర్, నందీశ్వర్, శివకుమార్, వెంకటరమణ, రాంచరణ్, ఇందులు విధులు చేపట్టారు.

రేగోడ్, గజ్వాడ ప్రభుత్వ పాఠశాలలో ..

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్, గజ్వాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. రేగోడ్ ప్రాథమిక పాఠశాలలో.. కలెక్టర్‌గా అక్షర, డీఈఓగా మదిహ, ఎంఈఓగా సిద్దార్థ, హెచ్‌ఎంగా తనీష్, ఉపాధ్యాయులుగా భవ్య శ్రీ, రమ్య, ధనలక్ష్మి, దీపిక, అశ్విక, వైష్ణవి, శీబ, సన, బిందుప్రియ, విశాల్, లక్ష్మణ్, అయాన్, బసవరాజ్, సుధాకర్, నందీశ్వర్, వినయ్ కుమార్ ఒకరోజు ఉపాధ్యాయులుగా ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంజిబాబు, ఉపాధ్యాయులు అశోక్, సందీప్, నవీన్, స్వాతి, స్వప్న పాల్గొన్నారు.



వెంకట్‌రావ్‌పేట పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



రేగోడ్(మెదక్): ఉపాధ్యాయులతో విద్యార్థులు



చిన్నశంకరంపేట(మెదక్): రుద్రారం గ్రామంలో..

రుద్రారం పాఠశాలలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా అభిలాష్, ఉపాధ్యాయులుగా అక్షయ్, అరుణ్‌కుమార్, విఘ్నేష్, శ్రీజ, రేణుక, స్పందన, వైష్ణవి వ్యవహరించారు. విద్యార్థులను హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు గోపాల్, లక్ష్మి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రతీ విద్యార్థికి మానసిక ధృడత్వం ఉండాలి**

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్ అండ్ మెంటల్ హెల్త్ ట్రైనింగ్ నిర్వహించారు. గురువారం ఈ సందర్భంగా విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ సునీత విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత కేంద్ర టీం, జెండర్ స్పెషలిస్ట్ కవిత పాల్గొన్నారు.

◆ **ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం**

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి హర్షం వ్యక్తం చేశారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటకు చెందిన నాగేందర్‌కు సీఎం సహాయ నుంచి మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీని కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి అందజేశారు.

◆ **కాద్లూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ గ్రామంలో ఉపాధిహామీ నిధులైనా రూ.10లక్షలతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మండల కో-ఆప్షన్ సభ్యులు మజహర్, పంచాయతీ కార్యదర్శి కీర్తిరెడ్డి, నాయకులు పాపయ్య, దుర్గగౌడ్, భూమయ్య, శంకర్. బక్క సిద్దు, ఎరుకల శ్రీను, మెడబోయిన సత్తయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బెల్ట్‌షాపు యజమానిపై కేసు నమోదు**

చేగుంట(తూప్రాన్): అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లితిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రఘుపతి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు బెల్టుషాపు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ **వీధిలైట్లు ఏర్పాటు చేయాలి**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని మహిళలు గురువారం స్పెషల్ అధికారి సురేశ్‌కుమార్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని నస్కల్ క్రాస్ రోడ్డు నుంచి చిలుకలమ్మ గుడి వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

◆ **నివాళి**

పాపన్నపేట(మెదక్): ఇటీవల మరణించిన కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రుక్మారెడ్డి చిత్రపటానికి గురువారం పొడిచన్‌పల్లిలో సొసైటీ ప్రస్తుత చైర్మన్ రమేశ్, డైరెక్టర్లు ఘనంగా నివాళులు అర్పించారు.

◆ **శంకర్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి రైతు సహకార సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంతో పాటు రైతులకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నార్సింగి సహకార సంఘం భవనంలో శంకర్‌గౌడ్ సంస్మరణసభ నిర్వహించారు. వైస్ ఎంపీపీ సుజాత, సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహచారి, సెక్రటరి నర్సింలు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు, శ్రీపతిరావు, సత్తయ్య, ఏఈఓ విజృంభణ, సిబ్బంది పాల్గొన్నారు. నార్సింగి పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌గౌడ్ చిత్రపటానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

◆ **విద్యుత్ వైర్లతో ప్రమాదం**

శివ్వంపేట(నర్సాపూర్): నివాసగృహాల మీదుగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌తో ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని గ్రామస్తులు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని నివాసగృహాల మీదుగా ఓ ఫామ్‌హౌస్‌కు నూతనంగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారని, ఆ పనులను నిలిపివేయాలని వేయాలని గ్రామస్తులు గురువారం నిరసన వ్యక్తం చేశారు.

◆ **ఆలయ ధర్మకర్తల కమిటీలకు నోటిఫికేషన్**

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల కమిటీల ఏర్పాటుకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ జారీ అయినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల వారు 10 రోజుల్లో సంగారెడ్డిలోని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **పాఠశాల తనిఖీ**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని శెట్టిపల్లి ఎక్స్‌రోడ్ ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాధికారి నీలకంఠ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో బ్లాక్ బోర్డుపై రాసిన సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను చదివించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు.

◆ **గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం**

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని యశ్వంతరావుపేట, హస్తాల్‌పూర్ గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు, మానెపల్లిలో ఓ కిరాణ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ.. అంతర్గత రహదారుల నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, సుధాకర్‌గౌడ్, నిరంజన్, లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలి**

హవేళిఘణాపూర్(మెదక్): పదో తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని బాగా చదివి లక్ష్యం సాధించే దిశగా కృషి చేయాలని కూచన్‌పల్లి జెడ్పీ హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుమోహన్ అన్నారు. గురువారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

◆ **8మంది అరెస్టు**

చేగుంట(తూప్రాన్): బొమ్మ బొరుసు ఆడుతున్న 8మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు గురువారం తెలిపారు. మండలంలోని పోతాన్‌పల్లి శివారులో బొమ్మ బొరుసు ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనలో 8 మందిని అదుపులోకి తీసుకొని 11 బైకులు, రూ.40 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

◆ **తల్లీ, కొడుకుల అదృశ్యం**

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ కంటి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన తల్లీ కొడుకులు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోమటిపల్లికి చెందిన పల్లపు రాజు అతడి భార్య భవాని, చిన్న కుమారుడు శరత్‌తో కలిసి కామారెడ్డిలోని ఓ కంటి ఆస్పత్రికి వచ్చారు. రాజు మెడికల్ షాపులో మందులు కొనడానికి వెళ్లి వచ్చేసరికి ఆస్పత్రిలో అతడి భార్య, కుమారుడు కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.